ప్రజాశక్తి
శనివారం 24 డిసెంబర్ 2022 | 5 | అనంతపురం



పోలీసు గ్రీవెన్స్‌లో 12 వినతులు


అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని పోలీసు శాఖలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే నిమిత్తం ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై సిబ్బంది 12 వినతులు అందజేశారు. వారందరితోనూ ఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. సమస్యలకు చట్ట పరిధిలో పరిష్కారం చూపాలే చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలన అధికారి శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, తేజ్‌పాల్, ఎస్పీ సిసి ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం

- లబ్ధిదారులను పట్టించుకోని ప్రభుత్వం
- 27 నుంచి జిల్లాలో పాదయాత్ర
- సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-ఉరవకొండ

జగనన్న ఇళ్ల నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీనివల్ల లబ్ధిదారులు తీవ్ర మానసికక్షోభకు గురవుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పేర్కొన్నారు. శుక్రవారం నాడు ఆయన ఉరవకొండలోని జగనన్న కాలనీలను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఉరవకొండ సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాలరంగయ్య, మండల కార్యదర్శి మధుసూదన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లాలో 68,288 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 21న 27వేల నూతన గృహప్రవేశాలు చేపడతామని వైసిపి ప్రభుత్వం, అధికారులు ఆర్భాటపు ప్రకటనలు చేశారన్నారు. ఈ ప్రకటనలు పేపర్లకే పరిమితం అయ్యాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణి, అధికారుల ఒత్తిడి, పెరిగిన ధరలు తదితర కారణాలతో 28,336 మంది పేద లబ్ధిదారులు తాము ఇళ్లు నిర్మించుకోలేమని అధికారులకు రాతపూర్వకంగా రాసి ఇచ్చారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు కేవలం 16 వేల ఇళ్ల మాత్రమే పునాది స్థాయికి వచ్చాయన్నారు. పూర్తిస్థాయిలో నిర్మించిన ఇళ్లు 6045 మాత్రమే అన్నారు. కేవలం 10 శాతం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఉరవకొండ, గుంతకల్ గార్లదిన్నె అనంతపురం తదితర మండలాల్లో 11 వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలు పంపిణీ చేశారన్నారు. అయితే వీరికి ఇంత వరకు ఇళ్ల స్థలాలు చూపకుండా ప్రభుత్వం, అధికార యంత్రాంగం పేదల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఉరవకొండలో ఇళ్ల పట్టాల కోసం దీక్షలు చేసిన నాయకులు వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణాల్లో జరుగుతున్న నిర్లక్ష్యమే 2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీకి ప్రధాన గుదిబండగా మారబోతోందన్నారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి పాదయాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. 27న గుత్తి జాతీయ రహదారిలో పాదయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ఈనెల 29వ తేదీన వేలాదిమంది గృహ నిర్మాణ లబ్ధిదారులతో కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తామన్నారు. పాదయాత్ర, మహాధర్నాలో ప్రజలు, గృహ నిర్మాణ లబ్ధిదారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, రైతుసంఘం జిల్లా నాయకులు జ్ఞానమూర్తి, సిపిఎం మండల నాయకులు సిద్ధప్ప, శీనప్ప, వెంకటేసులు, రవి పాల్గొన్నారు.



జిల్లా కేంద్రమైన అనంతపురం నగరంలో ట్రాఫిక్ కష్టాలు అనంతమైనవిగా ఉన్నాయి. విద్యా సంస్థలు, కార్యాలయాలకు వెళ్లే సమయాల్లో ఉదయం, సాయంత్రం ఈ కష్టాలు మరింత అధికంగా ఉంటున్నాయి. వీటిని తొలగించే చర్యలు చేపట్టే వారు లేక ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన కూడళ్లలోనూ ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నా, ఉపయోగం లేనట్లుగానే ఉన్నాయి. పోలీసు సిబ్బంది ద్వారానే నియంత్రించాల్సి ఉంటోంది.

'అనంత' ట్రాఫిక్ కష్టాలు..!

- కూడళ్లలో సిగ్నల్స్ ఉన్నా.. ఉపయోగం సున్నా..
- ఉన్నతాధికారి ఎవరూ లేని పరిస్థితి
- వాహన దారులకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరం శివారు ప్రాంతాలన్నీ కలిపితే సుమారు మూడు లక్షల వరకు జనాభా ఉంది. ఈ నగరంలో ట్రాఫిక్‌కు ఒక క్రమ పద్ధతిలో నడిపించే వారు లేక అస్తవ్యస్తంగా ఉంటోంది. ప్రధానంగా సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, తాడిపత్రి బస్టాండ్ సర్కిల్, ధర్మవరం బస్టాండు సర్కిల్‌తోపాటు, జాతీయ రహదారి ఎన్‌హెచ్ 44 కలిసే తపోవనం, రుద్రంపేట వద్ద రద్దీ అధికంగా ఉంటోంది. ఉదయం 8.30గంటల నుంచి పది గంటల్లోపు విద్యా సంస్థలకు వెళ్లే బస్సులు, అటు కియా పరిశ్రమకు వెళ్లే బస్సులు వస్తుంటాయి. ఈ సమయంలో ఈ కూడళ్లలో పెద్దఎత్తున ట్రాఫిక్ జామ్ జరుగుతూ ఉంటోంది. సాయంత్రం ఐదున్నర గంటల సమయంలోనే ఇదే పరిస్థితి ఉంటోంది. ఈ సమయాల్లో ఈ కూడళ్లలో జనం తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఇంకో వైపు న్యూటౌన్, ఓల్డ్‌టౌన్ కలిపే ప్రధాన రహదారిగానున్న టవర్‌క్లాక్ బ్రిడ్జి నిర్మాణపు పనులు సాగుతుండటంతో మొత్తం ట్రాఫిక్ అంబేద్కర్ బ్రిడ్జిపై నుంచి రావాల్సి ఉంటోంది. దీంతో రుద్రంపేట సర్కిల్ నిత్యం రద్దీగా మారుతూ ఉంటోంది. ఇదే సమయాల్లో పోలీసులు కూడా జరిమానాలు విధించే పనులు చేపడుతుండటంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వారు ఎటు వెళ్లాలో తెలియక అవస్థలు పడుతున్నారు

పనిచేయని సిగ్నల్స్

ప్రధాన కూడళ్లలో సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. అవి మూణ్నాళ్ల ముచ్చటగానే మారాయి. ఇవి ఎక్కడా సక్రమంగా పనిచేయడం లేదు. పోలీసు సిబ్బంది చేతనే నియంత్రిస్తున్నారు. ఆ సిబ్బంది పక్కకు వెళ్తే ట్రాఫిక్ మొత్తం అస్తవ్యస్తంగా మారుతోంది. ప్రమాదాలు కూడా చోటు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయి.

పర్యవేక్షణ అధికారి కరువు ...

అనంతపురం నగరంలో ట్రాఫిక్‌ను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా పోలీసు స్టేషన్ ఉంది. ఇక్కడ డీఎస్పీ పోస్టు కూడా ఉంది. అయితే డీఎస్పీ ప్రస్తుతం ఎవరూ లేరు.గతంలోనున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డిని లా అండ్ ఆర్డర్‌కు వేశారు. ఆయన్ను అక్కడికి మార్చాక ఇక్కడ డీఎస్పీ లేరు. కనీసం సిఐ స్థాయి అధికారి కూడా లేరు. ఎస్‌ఐతోనే మొత్తం ట్రాఫిక్‌ను నెట్టుకొస్తున్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి ఏదీ.?

నగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలంటే ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కొన్ని ప్రారంభమై పనులు సాగుతుండగా మరికొన్ని ముందుకు సాగడం లేదు. ప్రధానంగా బస్టాండ్ నుంచి గుత్తి రోడ్డుకు నేరుగా కలిపే శాంతి నర్సింగ్‌హోమ్ రోడ్డు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. ఎన్టీఆర్ మార్గ్ ఇటీవల పూర్తి చేయడంతో కాస్త ఇబ్బంది తొలగింది. ఇక రామ్‌నగర్ బ్రిడ్జి కింద భాగంగా ఒకవైపు రోడ్డు వేసినా అటువైపు వాహనాల రాకపోకలు జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో రామ్‌నగర్ వైపు ఒక్కవైపు రాకపోకలకు సాగి వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అదే విధంగా పెద్ద వాహనాలు నగరంలోకి ప్రవేశించకుండా వేస్తామని హామీనిచ్చిన అవుట్ రింగు రోడ్డు హామీగానే మిగిలింది. పాతూరులోని ప్రధాన రహదారుల విస్తరణ ముందుకు సాగలేదు. ఉన్న రహదారుల్లోనే జనం కిక్కిరిసిపోయి వెళ్లాల్సి వస్తోంది.

శింగనమల కెజిబివిలో మరోసారి ఫుడ్‌పాయిజన్ కలకలం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

- మజ్జిగ తాగిన 25 మంది విద్యార్థినులకు అస్వస్థత
- మజ్జిగలో బల్లిపడిందంటున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-శింగనమల

శింగనమల ప్రభుత్వ కస్తూరిబా పాఠశాలలో మరోసారి ఫుడ్‌పాయిజన్ కలకలం రేగింది. పాఠశాలలో శుక్రవారం రాత్రి మజ్జిగ తాగిన విద్యార్థులు తీవ్ర కడుపునొప్పితో బాధపడ్డారు. వెంటనే వారిని పాఠశాల సిబ్బంది చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాధిత విద్యార్థినులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... శింగనమల కస్తూరిభా పాఠశాలలో దాదాపు 250 మంది వరకు విద్యార్థినులు ఉన్నారు. వీరికి ప్రతి రోజూలాగానే శుక్రవారం సాయంత్రం మజ్జిగను ఇచ్చారు. ఇది తాగిన కొద్దిసేపటికే దాదాపు 25 మంది విద్యార్థినులు తీవ్ర కడుపునొప్పితో బాధపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది అస్వస్థతకు గురైన విద్యార్థినులను చికిత్స నిమిత్తం శింగనమల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఫుడ్‌పాయిజన్ వల్లే కడుపునొప్పి వచ్చిదని ప్రాథమికంగా తెలిపారు. వీరిలో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న స్వప్న, అంజలి, నవకీర్తి, శశికళ, మల్లేశ్వరి, మానస, నాగేశ్వరిలను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. కాగ మజ్జిగలో బల్లి పడడం వల్లనే ఫుడ్‌పాయిజన్ అయ్యిందని విద్యార్థులు చెబుతున్నారు. అధికారులు మాత్రం దీనిని ఇంకా ధ్రువీకరించలేదు. పాఠశాలలో ఫుడ్‌పాయిజన్ విషయం తెలియగానే తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో కెజిబివి వద్దకు చేరుకున్నారు. తమ పిల్లలకు ఏమైందో అని తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. పాఠశాలలో ఉన్న పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు అక్కడికెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కాగ నెల రోజుల వ్యవధిలో ఒకే పాఠశాలలో రెండు సార్లు ఫుడ్‌పాయిజన్ అయ్యి విద్యార్థులు అస్వస్థకు గురవడంపై తల్లిదండ్రులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు కారణమైన వారిపై చరయలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైఎస్ఆర్ ఆసరా లబ్ధిదారుల జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని 14 సచివాలయాల్లో వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించినట్లు వైఎస్ఆర్ క్రాంతిపథం ఎపిఎం నీలమని తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ఐకెపి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ 14 సచివాలయాల పరిధిలో దాదాపు 736 సంఘాలకు 7,351మంది లబ్ధిదారులకు ఆసరా మంజూరైనట్లు తెలిపారు. వీటిపై ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత యానిమేటర్, సీసీలను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే గతంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ తీసుకున్న మహిళా సంఘాల్లోని సభ్యులు తీసుకున్న అప్పును డిసెంబర్‌లోగా చెల్లిస్తే జనవరిలో నూతనంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ లోన్లు మంజూరు చేస్తామన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలో బకాయి ఉన్న విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఏడీ శ్రీనివాసన్ నాయుడు కోరారు. ఈమేరకు శుక్రవారం మండలంలో కేంద్రంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహాలు, వ్యవసాయ పంపుసెట్లు, కమర్షియల్ కింద ఉన్న సర్వీసులు కలిసి సుమారు మండలంలో రూ.5కోట్ల బకాయిలు రావాల్సి ఉందన్నారు. కావున సిబ్బంది గ్రామాల్లో తిరిగి బయాయిల వసూళ్లకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలోనూ బకాయిలను గుర్తించి వాటి వసూలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, లైన్ ఎల్‌టిలు సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణమస్తు, షాదీతోఫాలపై అవగాహన

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పేదల వివాహాలకు ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లో కళ్యాణమస్తు, ఇళ్ల నిర్మాణ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన నూతన దంపతులు ఖచ్చితంగా వివాహ ధ్రువపత్రం పొంది నిర్ణీత సమయంలోగా కళ్యాణమస్తు పథకానికి దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. వివాహ ధ్రువపత్రాల జారీలో ఆలసత్వం తగదన్నారు. వివాహానికి స్థానిక అధికారుల వద్ద అనుమతి తీసుకునే సమయంలోనే పథకం గురించి సంపూర్ణ వివరాలు అందించేలా చూడాలన్నారు. భార్యాభర్తలిద్దరూ పదవ తరగతి ఉత్తీర్ణత సాధిస్తేనే పథకం వర్తిస్తుందన్నారు. వికలాంగులు, వితంతు మహిళల వివాహానికి, సంక్షేమ శాఖ వద్ద నమోదు చేసుకున్న భవన, ఇతర నిర్మాణ కార్మికులకు సైతం పథకం వర్తించే విషయాలకు విస్తత ప్రచారం కల్పించాలన్నారు. అర్హులైన నూతన వధూవరులు సంబంధిత గ్రామ. వార్డు సచివాలయంలో కళ్యాణమస్తు, షాదీతోఫాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నవశకం పోర్టల్‌లో ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ వివరాలను ప్రజలకు సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, ఇన్‌ఛార్జి హౌసింగ్ పీడీ కేశవ నాయుడు, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

తక్కువ ఖర్చుతో అధిక దిగులు సాధించేలా క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు సూచనలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ సూచించారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి శిక్షణపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఎడిఎ లక్ష్మానాయక్, డిఆర్‌సి సిబ్బంది శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అనంతపురం వ్యవసాయ అధికారులు వెంకట్‌కుమార్, రాకేశ్ నాయక్, ఐదు మండలాల వ్యవసాయ అధికారులు, 79 రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

శాతవాహన ఫ్యాక్టరీలో తనిఖీలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్


శాతవాహన ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా ఆఫీసర్ ఓబులు

మండలంలోని శాతవాహన ఫ్యాక్టరీని జిల్లా మలేరియా ఆఫీసర్ ఓబులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాతవాహన ఫ్యాక్టరీ గత ఆరేళ్ల క్రితం ఆగిపోయిందన్నారు. తిరిగి పునప్రారంభించడానికి యాజమాన్యం సిద్ధమైన సందర్భంలో తనిఖీ కోసం వచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థ పదార్థాల వల్ల కార్మికులకు ఎలాంటి ప్రాణహాని, నష్టాలు కలగకుండా యాజమాన్యం చర్యలు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. అలాగే స్థానికంగా తాగునీరు ఆహారం, సీజనల్ వ్యాధుల పట్ల యాజమాన్యం అప్రమత్తంగా ఉండాల్సిన అంశాలను వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మనహాల్ వైద్యాధికారి డాక్టర్ శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ యుగంధర్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ పిల్లలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటనాయుడు

చిన్నారులకు సంపూర్ణ పౌష్టికాహారం అందించాలి


ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

అంగన్‌వాడీల్లోని చిన్నారులకు సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందించాలని ఎంపిడిఒ వెంకటనాయుడు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సంతే కొండాపురం, పాల వెంకటాపురంలోని అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా నేరుగా పిల్లలతో మాట్లాడి భోజన నాణ్యతను పరిశీలించారు. తర్వాత సంతే కొండాపురం గ్రామంలోని సచివాలయం, చెత్త సంపద తయారీ కేంద్రం, ఆర్‌బికె, పాల వెంకటాపురంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల స్వార్థం..పేదలకు శాపం : కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

వైసిపి పాలకుల అసమర్థత, స్వార్థ రాజకీయ కారణాల కారణంగా పేదలకు శాపంగా మారిందని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని 24వ వార్డులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌రెడ్డి చేతగానితనం వల్ల అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందన్నారు. అంతేగాకుండా స్థానిక ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అక్రమ సంపాదనలో భాగంగా కర్ణాటక నుంచి నకిలీమద్యం విచ్చలవిడిగా సరఫరా అవుతోందన్నారు. ఫలితంగా యువకులు మద్యానికి బానిసలై భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకుల అవినీతి, అసమర్థత వల్ల పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. వైసిపి నాయకులకు ఓట్లు వేసిన పాపానికి వార్డుల్లో కనీస మౌలిక వసతులు కల్పించపోవడంతోపాటు సంక్షేమ పథకాల్లో భారీగా కోతలు విధిస్తున్నారని మండిపడ్డారు. సాంకేతిక కారణాలతో పేదలకు అందాల్సిన ఫించన్లను అధికారులు తొలగించడం అన్యాయమన్నారు. చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. ముఖ్యంగా దిగువ మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయన్నారు. అలాగే సాయంత్రం మండల పరిధిలోని బి.ఎన్ హళ్లి గ్రామంలో మండల కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో ఇదేమి కర్మ – మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, వార్డు ఇన్‌ఛార్జి రవి, మాజీ కౌన్సిలర్ సుమలత, తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శి ఇనాయత్ బాషా, మండల కన్వీనర్ హనుమంతు, కౌన్సిలర్ ప్రశాంతి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, జిల్లా వాణిజ్య సెల్ అధ్యక్షుడు వెంకటేశులు నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కడ్డిపూడి మహబూబ్‌బాషా, బిసి సెల్ అధ్యక్షుడు తిప్పయ్య, జిల్లా బిసి సెల్ కార్యదర్శి ధనార్జున, అధికార ప్రతినిధి సురేంద్ర పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ప్రభాకర్‌చౌదరి


మహిళతో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

అనంతపురం కలెక్టరేట్ : వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, తిరిగి అభివృద్ధి వైపు సాగాలంటే తెలుగుదేశం పార్టీని ప్రజలు గెలిపించుకోవడానికి సహకరించాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ప్రజలను కోరారు. శుక్రవారం నారాయణపురం పంచాయతీ పరిధిలో ఇదే ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జి డిష్.నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, రాష్ట్ర కార్యదర్సులు ఆదినారాయణ, దేవర్లమురళీ, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నారాయణ స్వామి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు డిష్ నాగరాజు, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సాలార్ బాష, జిల్లా టియన్‌టియుసి అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, రాష్ట్ర కురబయాదవ సమన్వయ మెంబరు శివబాల, మాజి కార్పొరేటర్లు, సరళ, షరీనా, రాష్ట్ర నాయకులు స్వప్న, తేజస్వీణీ, కూచిహరి, గుర్రం నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్ వాష్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

హ్యాండ్ వాష్ స్టేషన్ ప్రారంభం

గుత్తి : మున్సిపాలిటీ కార్యాలయంలో యూనిసెఫ్ సహకారంతో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్ స్టేషన్‌ను ప్రజా ప్రతినిధులు, అధికారులు శుక్రవారం ప్రారంభించారు. స్టేషన్ సంబంధించిన ట్యాంకును మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ మెప్మా పీడీ విజయలక్ష్మి లు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాత్రూం లు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ లు బి.వరలక్ష్మి, బి.పద్మలత, మున్సిపల్ మేనేజర్ మురళీధర్ మురళీధర్, సచివాలయాల అధికారి ఇమామ్ హుస్సేన్, టీఎంసీ కెరన్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు

అనంతపురం : స్థానిక రామ్‌నగర్‌లోని కిండర్ టౌన్ ప్రీస్కూల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు క్రిస్మస్ తాత వేషధారణలతో అందరినీ అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జైనాబ్ నూర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీవన ఎరువులపై అవగాహన

బుక్కరాయసముద్రం : జీవన ఎరువుల గురించి పండ్ల తోటల రైతులకు ఉద్యాన అధికారి శైలజ అవగాహన కల్పించారు. శుక్రవారం చెన్నంపల్లి గ్రామంలో రైతు కొత్తరాయుడు చీనీ తోటలో తోటబడి కార్యక్రమం నిర్వహించారు. రేకులకుంట ఉద్యాన శాస్త్రవేత్తలు దీప్తి, విమల పాల్గొని రైతులకు పండ్లతోటల పెంపకం, తెగుళ్ళు, మందులు, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఐఐహెచ్‌ఆర్ బెంగళూరు వారు విడుదల చేసిన సిట్రస్ స్పెషల్ నీమ్ సోప్ తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. మాజీ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, వ్యవసాయ, ఉద్యానశాఖ రైతు భరోసా కేంద్రం అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

బెలుగుప్ప : రవనేపల్లి, బ్రాహ్మణపల్లి అంగన్వాడీ సెంటర్లలో సర్పంచి మందలపల్లి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రవనేపల్లి వైసిపి నాయకులు అనిల్, నారాయణస్వామి, పంచాయతీ సెక్రెటరీ దాసరి మల్లికార్జున, జగన్నాథ, బ్రాహ్మణపల్లి రామాంజనేయులు, సన్నప్ప బ్రాహ్మణపల్లి తండా గోపాల్ నాయక్, కమల నాయక్ పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో పుట్లూరు విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-పుట్లూరు

జాతీయ స్థాయి రంగోత్సవ్ చిత్రలేఖనం పోటీలలో పుట్లూరు మండలం కడవకల్లు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఐదు బంగారు పతకాలు, మూడు వెండి పతకాలు, మూడు రాగి పతకాలు సాధించారన్నారు. విద్యార్థులు సి.రజిత, కె.రాఘవి, పి.యశ్విత, ఎ.నరేంద్ర, సి.శ్వేత బంగారు పతకాలు సాధించారన్నారు. ఎన్.గౌరీ ప్రియ, కె.కళ్యాణి, వై.యామిని వెండి పతకాలు, ఎ.ఈశ్వర్, వి.కిషోర్‌కుమార్, బి.శ్రావణి రాగి పతకాలు సొంతం చేసుకున్నారని వెల్లడించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను, ఆర్ట్స్ ఉపాధ్యాయులు రాజశేఖర్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

రామన్ స్కూల్‌ను సీజ్ చేయాలని ధర్నా

ప్రజాశక్తి-అనంతపురంసిటీ

విద్యార్థి మృతికి కారణమైన రామన్ స్కూల్‌ను తక్షణమే సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐఖ్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్ర యాదవ్ మాట్లాడుతూ.. గురువారం రామన్ స్కూల్లో ఒక విద్యార్థి చనిపోతే నామమాత్రంగా స్కూల్‌ను సీజ్‌చేసి మరుసటి రోజు స్కూల్‌ను యథావిధిగా కొనసాగించడం బాధాకరమన్నారు. విద్యాశాఖ అధికారులు ముడుపులు తీసుకుని జిల్లా వ్యాప్తంగా పలు ప్రయివేటు పాఠశాలలకు విచ్చలవిడిగా పర్మిషన్లు ఇచ్చారన్నారు. యాజమాన్యం గుడిసెల్లో, ఎలాంటి సౌకర్యాలు లేని భవనాల్లో విద్యా సంస్థలను నడుపుతూ రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్నింటికి పర్మిషన్లు లేకుండా ఇంటర్నేషనల్ స్కూల్ అని పేర్లు పెట్టుకుని దోపిడీకి పాల్పడుతున్నారని తెలిపారు. అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తున్నా విద్యాశాఖాధికారులు నిమ్మకు నీరెక్కినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగితే విద్యార్థులు బయటకు కూడా రాలేనటువంటి ప్రయివేటు స్కూళ్లు అనంతపురం నగరంలో చాలా ఉన్నాయన్నారు. వాటిపై చర్యలు తీసుకునేందుకు విద్యాశాఖ అధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో చెప్పాలన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి జిల్లాలో పర్మిషన్ లేకుండా నడుపుతున్న, ఎలాంటి సౌకర్యాలు లేని, క్రీడా మైదానాలు లేని స్కూళ్లను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుల్లాయిస్వామి, చిరంజీవి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పృథ్వీ, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లోకేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వీరేంద్ర, ఎఐఎస్ఎ జిల్లా కార్యదర్శి అబ్దుల్ ఆలం, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఓబులేసు పాల్గొన్నారు.

గుత్తి : అనంతపురం పట్టణంలోని రామన్ పాఠశాలలో హాస్టల్ నిర్వహిస్తున్న పాఠశాలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. శుక్రవారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ సమావేశం జరిగింది. రామన్ స్కూల్ ను సీజ్ చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డిఇఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, గౌతమ్, నాయకులు రంగుడు, పవన్ గౌడ్, దర్శన్, శివనాయక్, రమేష్‌రెడ్డి, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు...



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

రామన్ స్కూల్లో డిప్యూటీ డీఈవో విచారణ

అనంతపురం పట్టణంలోని సాయినగర్ మొదటి క్రాస్ చివర్లో ఉన్న రామన్ స్కూల్లో అనంతపురం డిప్యూటీ డిఇఒ పద్మప్రియ శుక్రవారం సాయంత్రం విచారణ చేపట్టారు. ఆ స్కూల్ కరస్పాండెంట్ చితకబాదడంతో ఓ విద్యార్థి అవమానంతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. బాధితుల ఫిర్యాదు మేరకు కూడేరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ డిఇఒ విచారణ చేశారు. విచారణ నివేదికను డిఇఒకి అందజేస్తామని చెప్పారు. ఈ ఘటన సంబంధించిన కేసులో స్కూలు కరస్పాడెంట్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

నగర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
మేయర్ మహమ్మద్ వసీం



భూమిపూజ చేస్తున్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగర అభివృద్ధే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని నగర మేయర్ మొహమ్మద్ వసీం పేర్కొన్నారు. నగరంలోని 29వ డివిజన్ పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో చేపడుతున్న డ్రెయినేజీల నిర్మాణ పనులకు మేయర్ వసీం డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సైఫుల్లా బేగ్‌లతో కలసి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తీసుకువస్తున్న సమస్యలను పరిష్కరించడానికి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు విడుదల అవుతున్నాయన్నారు. ఇప్పటికే విడుదలైన నిధులతో అనేక డివిజన్ల పరిధిలో వేగవంతంగా పనులు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సహకారంతో అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కృషితో నగరంలో రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధికి తమ పాలకవర్గం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సిమెంటు రోడ్ల ఏర్పాటుతో పాటు డ్రెయినేజీలను కూడా ఏర్పాటుచేసి పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టామన్నారు. నగరంలోని అన్ని డివిజన్ల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా తమ పాలకవర్గం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్ కుమార్‌రెడ్డి, డీఈ చంద్రశేఖర్ నాయకులు అమ్ము, జావిద్, హుస్సేన్‌పీరా, నారాయణస్వామి, ఇబ్రహీం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో దుర్మార్గ పాలన
మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్

ప్రజాశక్తి-గుత్తి

ఏపీలో దుర్మార్గ పాలన కొనసాగుతోందని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ పేర్కొన్నారు, మండలంలోని టి.కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం టిడిపి మండల కన్వీనర్ బర్ధివలి ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్, టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం చేస్తోన్న అక్రమాలు, దౌర్జన్యాలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్ గౌడ్, నాయకులు ఆర్.హరినాథ్ గౌడ్, కేసీ హరి.అనిల్ గౌడ్, రవిశంకర్, రామచంద్ర యాదవ్, చిన్నరెడ్డి యాదవ్, అగ్గిరాముడు, గోవిందు, సర్పంచి భరత్, ఎంపీటీసీలు ధనుంజయ, నారాయణస్వామి, దిల్కాశీనా, మాజీ సర్పంచులు, డీలర్లు పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-ఉరవకొండ

స్నేహమేరా జీవితం..స్నేహమేరా శాశ్వతం అంటూ మాటల్లో కాదు చేతల్లో చూపించారు ఇంటర్ వరకు కలిసి చదువు కాళసముద్రం అంబేద్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు. మానవత్వం కనుమరుగై పోతున్న ఆధునిక సమాజంలో ఇంకా స్నేహానికి ఏ మూలనో కొద్దోగొప్పో ప్రేమ, అనురాగం, ఆప్యాయతలు ఉన్నాయని రుజువుచేసి చూపించారు. చనిపోయిన మిత్రుడు కుటుంబానికి కొండంత ధైర్యాన్ని ఇవ్వడంతో పాటు ఆర్థిక చేయూతను ఇచ్చి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. ఉరవకొండ పట్టణానికి చెందిన ఎం.సంజీవకుమార్ అకస్మాత్తుగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న మిత్రుడు జయన్న తమ మిత్రులకు వాట్సాప్ గ్రూప్‌లో విషయాన్ని తెలియజేశారు. మిత్రులందరూ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో మృతుని మిత్రులు రమేష్, నరసింహులు, ఓబులేసు, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



రైతుల సమస్యలను తెలుసుకుంటున్న టిసి.వరుణ్

ప్రజాశక్తి -అనంతపురం

శ్రీ కృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల, ఆచార్య ఎన్‌జి రంగా వ్యసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రైతు దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సంద్భంగా జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ హరీష, కళాశాల అసోసియేట్ డీన్ రవీంద్రనాథ్‌రెడ్డి విద్యార్థులకు వ్యాస రచన, పోస్టర్ ప్రదర్శన పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్రమంలో సహాయ ఆచార్యులు డాక్టర్ సురేష్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : అప్పుల ఊబిలో కూరుకుపోయి.. దిక్కు తోచని స్థితిలో బలవన్మరణాలకు పాల్పడిన కౌలు రైతులను అక్కున చేర్చుకున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నదాతలను ఆదుకొని వ్యవసాయాన్ని పండుగ చేస్తారని జనసేన జిల్లా అధ్యక్షులు, అర్బన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి టిసి.వరుణ్ అన్నారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణపురం పంచాయతీలో టిసి వరుణ్ ఆధ్వర్యంలో రైతుల పంట పొలాలను పరిశీలించారు. జనసేన పార్టీ అధికారంలోకి వస్తే రైతాంగాన్ని అభివృద్ధి పథాన పవన్ కళ్యాణ్ నడిపిస్తారని భరోసా ఇచ్చారు. రైతులను సత్కరించి భోజన వసతి కల్పించారు. నార్పల, శింగనమల గ్రామాల్లో జనసేన నాయకులు రైతుల పొలాలను పరిశీలించి భరోసా కల్పించారు.

ఆత్మకూరు : ఎంపీపీ హేమలత ఆధ్వర్యంలో స్థానిక రైతు భరోసా కేంద్రంలో జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వరలక్ష్మి, ఎఇఒలు సుజాత, విజయ్, విఎస్ఎ భాగ్యలక్ష్మి, వైసిపి నాయకులు అంజినప్ప, వన్నూరప్ప, మల్లన్న, శ్రీరామ్, రైతులు పాల్గొన్నారు.

శింగనమల : చిన్న మట్లగొంది వద్దనున్న సంజీవరాయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు లఘు నాటిక, నృత్య ప్రదర్శన ద్వారా రైతుల కష్టనష్టాలను కళ్లకుకట్టినట్లుగా చూపించారు. ఇద్దరు రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ : జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన యువ రైతుల కుటుంబ సభ్యులను సన్మానించి సాయం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయం గిట్టుబాటు కాక, చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని సిపిఐ ఉరవకొండ నియోజకవర్గం నాయకులు చెన్నారాయుడు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన



ఉపాధ్యాయుడిని విచారిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-ఉరవకొండ

వెకిలిచేష్టలతో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న నింబగల్లు జెడ్‌పి ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు వెంకటేశులుపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ ఉపాధ్యాయుడు మాకొద్దు అంటూ నినాదాలు చేశారు. అవేశానికి గురైన వారు ఉపాధ్యాయునిపై దేహశుద్ధికి ప్రయత్నించి అతన్ని గదిలో నిర్బంధించారు. అప్రమత్తమైన ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి ఉపాధ్యాయున్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు. గతంలో కూడా తెలుగు ఉపాధ్యాయుని ప్రవర్తనపై విద్యార్థుల తల్లిదండ్రులు సచివాలయ మహిళా కానిస్టేబుల్ ద్వారా పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు అధికారులు సదరు ఉపాధ్యాయుడికి కౌన్సిలింగ్ ఇచ్చి ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని హెచ్చరించి పంపారు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. తాము కూలినాలి చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నామని, ఉపాధ్యాయులు పిల్లలను ఇలా ఇబ్బందులకు గురిచేస్తే వారిని చదువు మాన్పించాల్సి దుస్థితి ఏర్పడుతుందని వారు వాపోయారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకం అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు కోసం పారిశ్రామిక వేత్తలను అన్ని రకాలుగా ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇండస్ట్రియల్ ఎక్స్‌పర్ట్ ప్రమోషన్ కమిటీ, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సేవలు, సహాయ సహకారాలు, అనుమతులు తదితరాలను సత్వరమే మంజూరు చేసి ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో 2015-20 ఇండస్ట్రియల్ పాలసీలో 9 యూనిట్లు రూ.30.67 లక్షలు, 2022-23లో 2 యూనిట్లకు గానూ రూ.76.55 లక్షలు, జగనన్న బడుగు వికాసము కింద 33 యూనిట్లకు రూ.612.08 లక్షలు సబ్సిడీ మంజూరు ఆమోదం తెలిపారు. వివిధ కారణాల వల్ల 4 యూనిట్లకు 11 క్లెయిమ్స్‌ను తిరస్కరించడమైందన్నారు. తిరస్కరించిన దరఖాస్తులను మరొకసారి పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్ విండో పోర్టల్ నందు నవంబర్, డిసెంబర్ నెలలో 64 దరఖాస్తులు రాగా అందులో 50 దరఖాస్తులు నిర్దేశించిన గడువులోగా ఆమోదించబడ్డాయన్నారు. ఒక దరఖాస్తును తిరస్కరించామని చెప్పారు. మిగిలిన 13 దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలని, ఎపిపిసిబి, పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. పిఎంఇజిపి 2022-23 ఆర్థిక సంవత్సరంలో 542 దరఖాస్తులను వివిధ బ్యాంకులకు పంపించగా నిర్దేశించిన 284 యూనిట్లలో 106 యూనిట్లు రూ.958.20 గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. 52 యూనిట్లు రూ.367.81 లక్షలు శాంక్షన్ దశల్లో ఉన్నాయని తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాలను డిసెంబర్ మాసంలో చేరుకోవాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూమి కేటాయింపు కోసం దరఖాస్తు చేసుకున్న కళ్యాణదుర్గం గోల్డ్ క్లస్టర్ వారి ప్రాతిపదికన భూమి కేటాయింపు కోసం రాష్ట్ర స్థాయి భూ కేటాయింపు కమిటీలో ప్రతిపాదనను ఉంచాలని సూచించారు. కాలుష్యం సంబంధించి 54 రకాల పరిశ్రమలలోని యంత్రాలు, పర్యావరణ, కార్మికుల భద్రతకు తీసుకోవాల్సిన ప్రమాణాలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి 70 పరిశ్రమలను సందర్శించి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. స్టాండప్ ఇండియాలో ప్రతి బ్యాంక్ వారు ఇద్దరికి పరిశ్రమ సర్వీసింగ్ వ్యాపారం యూనిట్లు స్థాపించడానికి రుణ సహాయం చేయాలని ఎల్‌డిఎంను ఆదేశించారు. రాప్తాడులో ఎంఎస్ఎంఇ పార్క్‌లో పరిశ్రమలకు అవసరమైన అన్ని రకాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను కల్పించి అహుడా అనుమతి పొందాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌ను ఆదేవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జి.నాగరాజారావు, ఎల్‌డిఎం నాగరాజారెడ్డి, ఎఫ్ఎపిసిసిఐ శేషాంజనేయులు, ఎఫ్ఎపిఎస్ఐఎ నాగరాజు, ఎపిఐఐసి జెడ్ఎం మురళీమోహన్, చేనేత శాఖ ఏడీ బసవరాజు, ఎపిఎస్ఎఫ్‌సి అసిస్టెంట్ మేనేజర్ రుద్రయ్య, ఆర్‌టిఒ బి.సురేష్‌నాయుడు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ఆత్మకూరు : ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆత్మకూరు మండలం పంపనూరు గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. పంపనూరు గ్రామానికి చెందిన మహేష్ (25) వ్యాపారం, కుటుంబ పోషణ నిమిత్తం అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి మూడు నెలలకు పరిశోధనలపై సమీక్ష

అనంతపురం : ఇక నుంచి ప్రతి మూడు నెలలకు పరిశోధన ప్రాజెక్టులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జేఎన్టీయూ కళాశాల మెకానికల్ విభాగం నందు రీసెర్చ్ డెవలప్‌మెంట్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో 25వ పరిశోధన సమీక్ష సమావేశం ఉపకులపతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో జరుగుతున్న పరిశోధనలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి పరిశోధన సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా గత సమీక్ష సమావేశానికి ఈ సమీక్ష సమావేశానికి పరిశోధన విద్యార్థుల యొక్క వర్క్ డెవలప్‌మెంట్‌ను సమీక్షిస్తామని తెలిపారు. సమీక్ష సమావేశాలకు ప్రతి విభాగంలో వివిధ కమిటీలను ఏర్పాటు చేశామని, వారి ఆధర్యంలో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పరిశోధన విద్యార్థులకు ఉపకులపతి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆచార్య యం. విజయకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మతసామరస్యమే దేశ ప్రగతికి పునాది

అనంతపురం : భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశానికి పునాది అని, మతాల మధ్య సామరస్యమే భారతదేశ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ నీరజ మేడుకోలను ఉద్దేశించి తెలిపారు. కులం ఎందుకు మతం ఎందుకు మానవత్వం ఉండగా మంచితనం మెండుగా అనే సందేశాత్మక అంశాన్ని చిత్రలేఖనం ద్వారా వైద్య విద్యార్థుల ప్రదర్శించిన తీరు అభినందనీయమని కొనియాడారు. శుక్రవారం కళాశాలలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులు ముస్కాన్, తేజస్విని, హర్ష వీణ, చిత్రేష్, రోహిత్, చందన రెడ్డి లకు ప్రశంసాపత్రాలను, మెడల్స్‌ను అందజేశారు. ఉత్తమ చిత్రలేఖన పత్రాలను భారతదేశ రక్షణ శాఖకు పంపనున్నారు. వైస్ ప్రిన్సిపల్స్‌లు ఆచార్య డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి, ఆచార్య డాక్టర్ సుబ్రహ్మణ్యం, పెథాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భవాని, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ దివ్య, డాక్టర్ దీప్తి, డాక్టర్ టిఆర్ఎస్ఎన్ లక్ష్మి, ఆదిరెడ్డి పరదేశి నాయుడు పాల్గొన్నారు.

'పింఛన్లు పీకేస్తే ప్రభుత్వాన్ని కూల్చేస్తారు'..

అనంతపురం : రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులు,ఒంటరి మహిళల పెన్షన్లు వడపోతతో నిత్యం వేధిస్తూ తొలగింపులకు శ్రీకారం చుడితే వైసిపి ప్రభుత్వాన్ని పీకేయడం ఖాయమని తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీ నర్సింహులు హెచ్చరించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగిస్తామని ఒక వైపు ప్రకటనలు చేస్తూ, మరోవైపు ఆర్థిక సంక్షోభం నుండి బయటపడటానికి పింఛన్లు పీకడం సరికాదన్నారు. వైసిపి ప్రభుత్వం పాలించే అర్హత కోల్పోయిందన్నారు. ప్రతి పేదవానికీ ఆంక్షలు లేకుండా ఇవ్వాల్సిన పెన్షన్లు ఇవ్వకుండా కొర్రీలు వేయడం దారుణమన్నారు. అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలోనే దాదాపు 2800 పింఛన్లు ఆపాలని దస్త్రాలు సిద్ధమవ్వగా, ప్రజా వ్యతిరేకత మూటగట్టుకోవాల్సి వస్తుందని అప్పటికప్పుడు ప్రభుత్వం దష్టికి తీసుకుని వెళ్లి తాత్కాలికంగా ఆపారన్నారు. ఇప్పుడు కాకపోయినా ముందుకు పింఛన్లు ఆపుతారనే అపవాదు వైసిపి ప్రభుత్వం మూటగట్టుకుందని దయబట్టారు. ముఖ్యమంత్రి దొడ్డిదారిన ఇలా పథకాలను పీకేస్తే, వైసిపి ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు పీకేస్తారని హెచ్చరించారు.

వైసిపి గూండాలను అరెస్టు చేయాలి

శింగనమల : పల్నాడు జిల్లా నరసరావుపేటలో టిడిపి కార్యకర్త ఇబ్రహీంను అతిదారుణంగా హతమార్చిన వైసిపి గూండాలను వెంటనే అరెస్టు చేయాలని, టిడిపి మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మొహమ్మద్ గౌస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మసీదు స్థలం వ్యవహారంలో అమాయకులపై వైసీపీ కార్యకర్తలు విచక్షణా రహితంగా దాడులకు పాల్పడడం బాధాకరమన్నారు. మృతుని కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలైన రహమత్ ఆలీ కుటుంబ సభ్యులను ఆదుకోవాలని కోరారు.

ఇద్దరు టీచర్లు సస్పెన్షన్

అనంతపురం సిటీ : విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేస్తూ అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటకృష్ణారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉరవకొండ మండలం నింబగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు సబ్జెక్టు టీచర్ వెంకటేశ్వర్లు, కూడేరు మండలం మరుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న హిందీ టీచర్ మారుతి ప్రసాద్‌లు విద్యార్థినులను అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో డిప్యూటీ డిఇఒలతో విచారణ చేయించి విచారణ నివేదిక ఆధారంగా సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు.

ఘనంగా గణిత దినోత్సవం



మాట్లాడుతున్న పాఠశాల డైరెక్టర్లు

అనంతపురం : అనంతపురం నగరం గుత్తి రోడ్డులోని సాయి విజ్ఞాన్ జూనియర్ కళాశాల, మూడవ రోడ్డులోని సాయి విజ్ఞాన్ పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు శ్రీనివాసులు, కరుణాకర్ బాబు, కళాశాల డైరెక్టర్ శివశంకర్ విద్యార్థులకు గణిత పితామహుడు శ్రీ రామానుజన్ జీవిత విశేషాలను వివరించారు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్లికార్జునకు టిడిపి నాయకుల నివాళి

శింగనమల : వెస్ట్ నరసాపురం గ్రామ పంచాయతీ గురుగుంట్ల గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త మల్లికార్జున శుక్రవారం గుండెపోటుతో మరణించారు. టిడిపి నాయకుడు దండు శ్రీనివాసులు మల్లికార్జున పార్థివదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, బిసిసెల్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, బాలన్న, మాజీ ఎంపిటిసి ఓబులేసు, జానగాని శివయ్య పాల్గొన్నారు.

జాతీయ చెస్ పోటీలకు నారాయణ విద్యార్థి

అనంతపురం : పశ్చిమగోదావరి జిల్లా అత్తిలిలో ఈనెల 21, 22 తేదీలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ అండర్ 19 గర్ల్స్ ఫెడరేషన్‌లో అనంతపురం ఖాజానగర్‌లోని నారాయణ కళాశాల ఇంటర్ విద్యార్థి పీజీ శ్రావణి 4వ ర్యాంక్ సాధించింది. ఆమె 4వ ర్యాంక్ సాధించడం ద్వారా జాతీయ చెస్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు శ్రామణికి అభినందనలు తెలిపారు.

ఆక్రమణకు గురైన రస్తా పునరుద్ధరణ

నార్పల : కేశేపల్లి గ్రామంలో ఆక్రమణకు గురైన ఆర్‌అండ్‌బి రస్తా సమస్యను రెవెన్యూ అధికారులు, పోలీసులు పోలీసులు పరిష్కరించారు. కొన్ని సంవత్సరాలుగా కేసేపల్లిలో రస్తా ఆక్రమణకు గురైంది. దీంతో వినాయ చవితి పండుగ సందర్భంగా విగ్రహాలను కూతలేరులో నిమజ్జనం చేసేందుకు ఇబ్బందిగా మారింది. గ్రామస్తుల విన్నపం మేరకు రెవెన్యూ అధికారులు, పోలీసులు శుక్రవారం గ్రామానికి వెళ్లి ఆక్రమణకు గురైన రహదారిని పునరుద్ధరించారు. ఎస్ఐ వెంకటప్రసాద్, ఆర్ఐ సందీప్, వీఆర్వోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.